




నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 24 జూలై 2024 | HYDERABAD













# నలుగురున్నా..

బడ్జెట్‌లో గుండుసున్నా

# నగరానికి మొండిచేయి

## కేంద్ర బడ్జెట్‌లో నల్లపూసగా హైదరాబాద్ మహా నగరాభివృద్ధి

**బీజేపీకి ముగ్గురు లోక్‌సభ, ఒక రాజ్యసభ సభ్యుడు**

ప్రత్యేక నిధులు తెస్తామంటూ పార్లమెంటు ఎన్నికల్లో గప్పాలు

కిషన్‌రెడ్డికి మంత్రి పదవి తప్ప
నగరానికి దక్కిందేమిటి?: ప్రశ్నిస్తున్న నగరవాసులు

*సికింద్రాబాద్... మల్కాజిగిరి... చేవెళ్ల... మూడు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందుకు అదనంగా ముషీరాబాద్‌కు చెందిన లక్ష్మణ్ రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరి.. దేశంలోని కీలక మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ మహా నగరానికి మంగళవారం కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో దక్కింది... 'గుండుసున్నా!'. ఐదేండ్ల కిందట కేంద్ర నిధులతో ప్రారంభించిన అంబర్‌పేట, ఉప్పల్ ఫ్లైఓవర్లు మొండి పిల్లర్లతో వెక్కిరిస్తుండగా.. తాజా బడ్జెట్‌లో ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టును సైతం సాధించలేదు. మూడోసారి మోదీ సర్కారు వస్తే నగరానికి అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటూ ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో ఊదరగొట్టిన బీజేపీ నేతలు కేంద్ర మంత్రి పదవితో సరిపెట్టుకొని సిరా ఆరకముందే నగర ఓటర్లను మోసం చేశారు.*

*-సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 23 (నమస్తే తెలంగాణ)*

**సాధారణంగా** కేంద్రంలో అధికారమున్న పార్టీ ఎంపీలు ఉంటే ఆ ప్రాంతానికి నిధులు పుష్కలంగా వస్తాయని సామాన్యుడు ఆశిస్తాడు. కానీ మునుపటి లెక్కనే తెలంగాణ... అందునా హైదరాబాద్ మహా నగర పరిధిలోని బీజేపీ ఎంపీలు సామాన్యుడి ఆశల్ని సమాధి చేశారు. గత పది సంవత్సరాల్లో హైదరాబాద్ మహా నగరం దేశంలోని ఇతర మెట్రో నగరాలను వెనక్కి నెట్టి అనేక రంగాల్లో దూసుకుపోయింది. ఇక్కడి మౌలిక వసతుల కల్పనకు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు సైతం ఫిదా అయిన సందర్భాలు అనేకం. ఈ క్రమంలో కేంద్రం నుంచి కూడా నగరాభివృద్ధికి ఆర్థికంగా చేయూత ఉంటే నగర భవిష్యత్తు ఇంకా ఉజ్వలంగా ఉంటుంది. కానీ గత పదేండ్లుగా హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి మొండిచెయ్యి చూపిన కేంద్రంలోని మోడీ సర్కారు మరో'సారీ' శీతకన్ను ప్రదర్శించింది. మంగళవారం పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పదమే కనిపించకపోగా... హైదరాబాద్ అభివృద్ధి అనేది నల్లపూసగా మారింది.

### కీలక ప్రాజెక్టుల విస్మరణ..

హైదరాబాద్ మహా నగరంలో మౌలిక వసతుల కల్పన అనేది కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున జరిగింది. ఫ్లైఓవర్లు, ఇతరత్రా నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మెట్రో రైలు రెండో దశకు రూ.8500 కోట్లు ఇవ్వాలని అనేకసార్లు అప్పటి పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కేంద్రాన్ని కోరారు. కానీ కేంద్రం స్పందించలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అలైన్‌మెంట్ మార్పులతో రెండో దశను ఏకంగా రూ.20వేల కోట్లతో ప్రతిపాదించింది. కానీ డీపీఆర్ పూర్తి కాకపోవడమో... కేంద్రంలోని మోడీ సర్కారు గత నిర్లక్ష్యాన్నే కొనసాగించడమో... మొత్తానికి కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్ మెట్రో రైలు పదమే కనిపించలేదు. దీంతో పాటు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్లాగ్‌షిప్ కార్యక్రమంగా చెబుతున్న మూసీ సుందరీకరణ అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.లక్షన్నర కోట్లకు పెంచింది. మరి ఇంత పెద్ద మొత్తం అంచనా వ్యయంగా ఉంటే ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు మూసీ సుందరీకరణకు కేంద్రం నుంచి అడిగిన నిధులు పట్టుమని పది శాతం కూడా కాకుండా కేవలం రూ.10వేల కోట్లు అడిగారు. చివరకు ఆ ప్రతిపాదనను సైతం కేంద్రం బుట్టదాఖలు చేసిందనేది తాజా బడ్జెట్‌తో బట్టబయలైంది.

### బీజేపీ ఎంపీలు ఇచ్చే జవాబు?!

మహా నగర పరిధిలోని సికింద్రాబాద్ స్థానం నుంచి గెలుపొందిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి పదవి దక్కించుకున్నారు. చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ తరపున గెలుపొందారు. మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్ కూడా గెలుపొందడంతో నగర పరిధిలోనే బీజేపీ ఎంపీల సంఖ్య మూడుకు చేరింది. వీరితో పాటు ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే లక్ష్మణ్ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇలా నలుగురు సభ్యులు ఉన్నప్పటికీ కీలకమైన హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం నుంచి నయాపైసా కూడా తీసుకురాకపోవడంపై నగరవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరకు కిషన్‌రెడ్డి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉండటం తెలంగాణ, హైదరాబాద్ నగరానికి అదనపు ప్రయోజనాన్ని చేకూర్చాలేగానీ కేవలం ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు మాత్రమే పరిమితం కావడం ఎంతవరకు సమంజసం అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.



# కంటోన్మెంట్ అంటే సాయన్న..

# సాయన్న అంటే కంటోన్మెంట్

ఆయన సేవలు చిరస్మరణీయం

లాస్య నందిత మరణం దురదృష్టకరం

శాసనసభలో ఎమ్మెల్యేల సంతాపం

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా సాయన్న చేసిన సేవలు ఎన్నటికీ మరిచిపోలేమని, అజాత శత్రువైన ఆయన వ్యక్తిత్వం అందరికీ ఆదర్శమని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. మంగళవారం అసెంబ్లీలో దివంగత ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య నందితల మృతి పట్ల శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానం పై వారు మాట్లాడారు. ఏడాది వ్యవధిలోపే తండ్రీబిడ్డలు మరణించడం తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కూడా సభలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగర ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

### కంటోన్మెంట్ అంటే సాయన్న



కంటోన్మెంట్ అంటే సాయన్న.. సాయన్న అంటే కంటోన్మెంట్ అనేంతగా ఎనలేని సేవచేశారు. సాయన్న నేను 1994లో ఇద్దరం ఒకేసారి శాసనసభకు వచ్చాం. కలిసి పనిచేశాం. మృదుస్వభావి. అనారోగ్యంతో నడవలేని స్థితిలో కూడా నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం పాటుపడ్డ వ్యక్తి సాయన్న. ముఠాగోపాల్, సాయన్న ఒకే స్కూటర్‌పై తిరిగేవారు. నియోజకవర్గ ప్రజలతో సాయన్న కుటుంబానికి 30 ఏండ్ల అనుబంధం ఉన్నది. ప్రజల మధ్య ఉండాలని పరితపించే వ్యక్తి సాయన్న. లాస్య ఎమ్మెల్యేగా గెలిచిన రెండు నెలల 20 రోజులకే చనిపోయింది. ఆ కుటుంబానికి తీరని అన్యాయం జరిగింది. ప్రజలకు జీవితాన్ని అంకితం చేసిన కుటుంబంలో ఏడాది కాకుండానే తండ్రి బిడ్డ చనిపోవడం.. కుటుంబాన్ని ఓదార్చడం ఎవరి వల్లా కావడం లేదు.లాస్య కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్న

**-ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

### లాస్య కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించాలి



సొంత ఇల్లు కూడా లేని లాస్య కుటుంబానికి ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వాలి. సాయన్న గొప్ప వ్యక్తి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి అవినీతిరహితంగా పనిచేశారు. సొంత ఇల్లు కూడా లేకుండా సాయన్న కుటుంబం ప్రజలకు సేవలు అందించింది. వారి కుటుంబానికి ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతున్న. లాస్య కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతున్నా

**-మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

### చురుకుగా ఉండేవారు



లాస్య నందిత మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. సాయన్న నియోజకవర్గం పేరుతోనే పిలవబడేవారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆయన సుపరిచితుడు. అందరితో మంచి సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తి. ఆయన బిడ్డలు కూడా ఎంతో చురుకుగా ప్రజాక్షేత్రంలో ఉండేవారు. ప్రజల మన్నలు పొందారు.

**- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్**

### సాయన్న, నేను మంచి మిత్రులం



నేను, సాయన్న మంచి మిత్రులం. సాయన్న సిండికేట్ బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తూ రాజకీయాలపై ఆసక్తిచూపేవారు. దోమల్‌గూడ డివిజన్ నుంచి తొలుత కార్పొరేటర్‌గా పోటీచేసి తొలుత కొద్ది ఓట్లతో ఓడిపోయారు. తర్వాత కంటోన్మెంట్ నుంచి గెలుపొందారు. ప్రజల కోసం చాలా కష్టపడ్డారు. డయాబెటిస్ కారణంగా సాయన్న ఒక కాలు బాగలేకపోయినప్పటికీ ప్రజల మధ్య ఉండేందుకు ప్రయత్నించేవారు. సాయన్న అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన వారసురాలిగా లాస్య బరిలో నిలిచి గెలుపొందారు. చిన్న వయసులోనే లాస్య చనిపోవడం బాధాకరం.

**- ముషీరాబాద్ ఎమ్మెల్యే, ముఠా గోపాల్**

### కంటోన్మెంట్ ప్రజలకు తీరని లోటు



నందిత కవాడీగూడ కార్పొరేటర్‌గా సేవలు అందించారు. లాస్య మరణం కంటోన్మెంట్ ప్రజలకు, అభిమానులకు తీరనిలోటు. ఈ రోజు నేను ఇలా మాట్లాడుతున్నానంటే ఆనాడు నాకు సాయన్న సలహాలు ఇవ్వడమే కారణం. ప్రత్యర్థులుగా పోటీలో ఉన్నా కంటోన్మెంట్‌లో నియోజకర్గ అభివృద్ధినే కోరుకొనేవాళ్లం. వారి కుటుంబానికి సానుభూతి ప్రకటిస్తున్న

**- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్**


